క్లుప్తంగా

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండలంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగామలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. మండలంలోని 32 పంచాయతీల్లో నిర్వహిస్తున్న లబ్ధిదారుల ఎంపిక సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత ఇంటి స్థలం ఉండి అర్హులైన లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

తాంసి: విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దని హార్ట్ ఫుల్ నెస్ సంస్థ కోఆర్డినేటర్ శ్రీకాంత్ కళాశాల విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఒత్తిడిని జయించి, భయాందోళన చెందకుండా పరీక్షలకు సన్నద్ధతపై అవగాహన కల్పించారు. పరీక్షలు అంటే ఆందోళనతో భయం ఉంటుందన్నారు. ధ్యానం చేయడంతో పాటు ఏకాగ్రతతో చదవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, ట్రైనర్‌లు హేమ, హరి చందన, హనుమాన్, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోష్, అధ్యాపకులు తిరుపతిరెడ్డి, దేవేంద ర్, మల్లేశ్, రమణ, ప్రవీణ్, భాస్కర్ పాల్గొన్నారు.

పంట కాలాన్ని పొడగించొద్దు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): పత్తి పంట కాలాన్ని పొడగించవద్దని ఏఈఓ తాసిఫ్ అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో గల పత్తి పంట క్షేత్రాలను వ్యవసాయ అధికారులు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటకు గులాబీరంగు పురుగు ఆశించిందని, చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా పురుగు ఉధృతి పెరుగుతుందన్నారు. డిసెంబర్ తర్వాత పత్తి పంటలను ఎట్టి పరిస్థితుల్లో పొడగించవద్దన్నారు.

మొక్కల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఇచ్చోడ: జాతీయ ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో నర్సరీల ద్వారా పెంచుతున్న మొక్కల సంరక్షణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని గేర్జంలో నర్సిని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలకు మూడు సార్లు నీరు అందించాలన్నారు. ఒక్క మొక్క కూడా చావకుండా బతికించుకోవాలన్నారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

18న వీడీసీ కార్యాలయం ప్రారంభం

ఇచ్చోడ: ఈనెల 18న మండల కేంద్రంలో వీడీసీ కార్యాలయం ప్రారంభించనున్నట్లు వీడీసీ అధ్యక్ష, కార్యదర్శులు పెరమల్ల నారాయణ, రేణికుంట సురేశ్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు డైమండ్‌కాంప్లెక్స్‌లో కార్యాలయం ప్రారంభానికి ఇచ్చోడలో ఉన్న అన్ని కుల సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

బోథ్: సీఎం కప్ పోటీల్లో భాగంగా సొనాల జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు మండలస్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి చేరుకున్నారు. కాగా జిల్లా స్థాయిలో జరుగుతున్న సీఎం కప్ క్రీడల్లో వారు పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

గ్రామాల్లో చిరుత భయం

బోథ్: మండలంలో చిరుతపులి ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. తాజాగా మండలంలోని ధన్నూర్(బి), నాగపూర్ గ్రామాల మధ్యలో గల గుట్ట వద్ద చిరుత పాదముద్రలు లభ్యమయ్యాయి. సోమవారం అటవీ శాఖ అధికారులు పాద ముద్రలను సేకరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు సాకెర గ్రామస్తులు గ్రామం వెనకాల ఉన్న గుట్ట వద్ద చిరుత కనిపించినట్లు పేర్కొన్నారు.

పత్తి దగ్ధం

బోథ్: మండలంలోని పిప్పల్ ధరి గ్రామానికి చెందిన బందారి కమలాకర్‌కు నాలుగు క్వింటాళ్ల పత్తి, స్ప్రింక్లర్లు, పైపులు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయినట్లు రైతు తెలిపారు. రూ.లక్ష నష్టపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

విహారయాత్రలతో విజ్ఞానం



బాసరకు వెళ్లిన పొన్నారి పాఠశాల విద్యార్థులు

- చారిత్రక కట్టడాలు, పుణ్యక్షేత్రాలకు వెళ్తున్న విద్యార్థులు
- క్షేత్రస్థాయి పర్యటనలతో ఉత్తేజం

తాంసి: ఏదైనా ప్రదేశాల గురించి వినడం కన్నా కళ్లతో నేరుగా చూడటంతో పూర్తి విషయాలు తెలుసుకోవచ్చు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠాలను వినడం కన్నా వాటిని విద్యార్థులు ప్రత్యక్షంగా చూస్తేనే విద్యార్థులకు గుర్తుండి పోతుంది. విద్యార్థులకు ఏమైనా ప్రదేశాల గురించి తెలియాజేయాలంటే విజ్ఞానాన్ని అందించే విజ్ఞాన విహారయాత్రలు ఎంతగానో ఉపయోగపడుతాయి. విహారయాత్రలు ఆహ్లాదం, ఆనందాన్ని కలిగిస్తాయి. ప్రస్తుతం విద్యార్థులను జిల్లాతో పాటు రాష్ట్రంలో పలుచోట్ల చూడదగిన ప్రదేశాలకు తీసుకెళ్తున్నారు. పొన్నారి, అర్లి(టి), నిపాని, కప్పర్ల, తాంసితో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులకు ఉల్లాసం, ఉత్సాహం, విజ్ఞానం పెంపొందిచాలనే లక్ష్యంలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారురు. బాసర, శ్రీరాం సాగర్ ప్రాజెక్టు, నిర్మల్ కొయ్య బొమ్మలతో పాటు భద్రాచలం, పాపికొండలు, రామప్ప, భద్రకాళి ఆలయాలను సందర్శించారు. హైదరాబాద్‌లో ఉన్న చూడదగిన ప్రదేశలైన మ్యూజియం, జూపార్క్, గొల్కొండ వంటి పురాతన కట్టడాలు, వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించారు.

ఫీల్డ్ విజిట్‌లో భాగంగా..

ఏదైనా ప్రదేశాలను, జంతువులను పర్యాటక ప్రాంతాలను నేరుగా చూడడం ద్వారా విద్యార్థులకు చిరకాలం గుర్తుండి పోతుంది. చాలా మంది ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లి పలు అంశాలను వివరిస్తున్నారు. ప్రతీ ఏటా విద్యార్థులు ఫీల్డ్ విజిట్‌కు తీసుకెళ్లే విధంగా విద్యాశాఖ ఆదేశాలు సైతం ఉన్నాయి. కొంత మంది విద్యార్థులను విహారయాత్రలో భాగంగా పర్యాటక ప్రదేశాలకు తీసుకెళ్తున్నారు. కట్టడాలను సందర్శించడం ద్వారా ఏ కాలంలో నిర్మించిన కట్టడాలు, నిర్మాణానికి ఉపయోగించిన సామగ్రి, రక్షణ విధాన్నాన్ని తెలుసుకుంటారు. పుణ్యక్షేత్రాలు సందర్శించడం ద్వారా భక్తిభావం, ఏకాగ్రత పెరిగి సన్మార్గంలో నడిచేందుకు వీలుంటుంది. విహారయాత్రలు విద్యార్థులకు మేలు చేయడంతో పాటు ఆలోచన విధానాన్ని సైతం పెంచుతాయి.

ఆనందంగా ఉంది



విహారయాత్రకు తోటి విద్యార్థులతో వెళ్లడం చాలా ఆనందంగా ఉంది. బాసర, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతో పాటు నిర్మల్ కొయ్యబొమ్మలు చూశాం. నిర్మల్ కొయ్య బొమ్మలను పరిశీలించి తయారు చేసే విధానాన్ని తెలుసుకున్నాం. బాసర సరస్వతి దేవి విశిష్టత తెలుసుకున్నాం. నేరుగా వీక్షించడం ఎప్పటికి గుర్తుండిపోతుంది.

– చరిత, ఐదో తరగతి, పొన్నారి పాఠశాల

అవగాహన పెరుగుతుంది



విహారయాత్ర వలన విద్యార్థులకు పర్యాటక ప్రదేశాలు, చారిత్రక కట్టడాలపై అవగాహన పెరుగుతుంది. ఎప్పుడు తరగతి గదిలో ఉండే విద్యార్థులను విహారయాత్రకు తీసుకెళ్తే ఉల్లాసంగా గడుపుతూ కొత్త విషయాలు నేర్చుకుంటారు. అర్లి(టి) పాఠశాల విద్యార్థులను పాపికొండలు, భద్రాచలం, రామప్ప ఆలయానికి తీసుకెళ్లి పర్యాటకు ప్రదేశాల ప్రాముఖ్యతను తెలియజేశాం.

– శ్రీధర్ రెడ్డి, హెచ్ఎం జెడ్పీహెచ్ఎస్ అర్లి(టి)

ఉట్నూర్‌కు తరలిన కొలాం గిరిజనులు



తరలివెళ్తున్న కొలాం ఆదివాసీ గిరిజనులు

ఇంద్రవెల్లి: మన్నెవార్లు తమ హక్కులను కాలరాస్తున్నారని, వారు ఏవిధంగా కొలవార్ కుల ధ్రువీకరణ పత్రం పొందుతున్నారనే డిమాండ్‌తో కొలాం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఐటీడీఏ ముట్టడి, మహా ధర్నా కార్యక్రమానికి ఇంద్రవెల్లి నుంచి కొలాం ఆదివాసీ గిరిజనులు ఉట్నూర్‌కు తరలివెళ్లారు. మండలంలోని పాటగూడ, ముత్యంపెట్, కేస్లాగూడ, నవగూడ, మర్కగూడ కొలాం ఆదివాసీ గిరిజనులు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. తమ న్యాయమైన డిమాండ్ నెరవేర్చే వరకు పోరాడుతామన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన కొలాం గిరిజనుల భాషను అడ్డు పెట్టుకొని కొలావర్ పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు పొంది తమ హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. చహకటి మానిక్‌రావ్, ఆత్రం మదన్, లింబారావ్, అమృత్‌రావ్, శేఖరావ్, సోనేరావ్, తుకారం, కొండు, గంగారం, తానుబాయి, రుక్మాబాయి, జంగుబాయి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాజీరావు బాబా సప్తాహం



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బేల: మండలంలోని పోనాల గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహం వేడుకలు సోమవారం ముగిశాయి. ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో, చిన్నారులను దేవతల రూపంలో అలకరించి శోభాయాత్ర నిర్వహించారు. బాజీరావు బాబా ఆలయ ప్రాంగణంలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనలు బోధించారు. చివరగా కాలదహీ హండీ చేపట్టి, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి, నాయకులు రాక్రే సాగర్, గోడే అవినాష్, మడావి చంద్రకాంత్, వాంఖడే నయన్ పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ జవాన్లుగా ఎంపికైన యువకులకు సన్మానం



సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరికొండ: ఇటీవల విడుదలైన సీఆర్పీఎఫ్ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన సిరికొండ మండల కేంద్రానికి చెందిన కొడుకల గంగన్న, కాస్బే సాయిలను సోమవారం బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిరికొండ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉందన్నారు. అంకితభావంతో ఉద్యోగ విధులు నిర్వర్తించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు పెంటన్న, లతీఫ్, ప్రకాశ్, మాల్లారెడ్డి, కృష్ణయ్య, రోహిదాస్, రాజు, అష్రాఫ్, మల్లేశ్ పాల్గొన్నారు.

జాలంసింగ్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు

నార్నూర్: సంఘ సంస్కర్త, సమానత్వం, ఐక్యతను చాటి చెప్పిన స్వర్గీయ బానోత్ జాలంసింగ్ నాల్గో జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీ ఏంపల్లి చౌరస్తాలో ఉన్న జాలంసింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో పాటు లంబడా జేఏసీ, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం, మాజీ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు నివాళులర్పించారు. బానోత్ జాలంసింగ్ మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల వంటి ఎన్నో కార్యాలయాలను విద్యాసంస్థలను తీసుకొచ్చి అభివృద్ధి పథంలో ముందు ఉంచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, ఫాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, సీనియర్ నాయకుడు భారత్ చౌహన్, గ్రామ పెద్దలు యశ్వంత్ రావు, దత్త రాథోడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో రూ.27 లక్షల నిధులతో 18 హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం వివిధ కాలనీల ప్రజలు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, వ్యవసాయ శాఖ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బద్దం పోతా రెడ్డి, కపిల్ దేవ్, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ఉమేష్, తజములు, సికిందర్, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉట్నూర్‌కు చేరిన బస్సుజాత



మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఉట్నూర్‌రూరల్: ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 18 వేలు వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) చేపట్టిన బస్సుజాత సోమవారం ఉట్నూర్‌కు చేరింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పి. విజయలక్ష్మి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ కార్యకర్తల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిసెంబర్ 15 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సుజాత నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకురాల్లు గంగామణి, నలాదేవి, సునిత, సాధన, పద్మ, బాలమణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

బోథ్: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న బిల్లులను వెంటనే చెల్లించాలని బోథ్ మండల మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల విద్యాధికారి కుమ్మరి పోశెట్టికి వినతిపత్రం అందజేశారు. బహిరంగ మార్కెట్‌లో గుడ్డు ధర రూ. 7.50 ఉండగా, ప్రభుత్వం తమకు ఒక గుడ్డుకు రూ.5 చెల్లిస్తోందన్నారు. మంగళవారం నుంచి వంట చేయలేమని ఎంఈవోకు తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన సౌకర్యం



భోజనం వడ్డిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో గత మూడు రోజులు కొనసాగుతున్నాయి. సోమవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారికి అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జోగు ఫౌండేషన్ ఎల్లవేళలా ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ముందుంటుందని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పల్లెల్లో చలి పంజా



బోథ్: మండల వ్యాప్తంగా పల్లెల్లో చలి పంజా విసురుతోంది. సాయంత్రం ఆరు గంటలకే చలి తీవ్రమవుతోంది. బోథ్, సొనాల, పొచ్చెర, కౌఠ, కనుగుట్ట, మర్లపెల్లి, ధన్నూర్(బి), కుచులాపూర్ గ్రామాల్లో చలి విపరీతంగా ఉంటోంది. పొచ్చెర గ్రామంలో సోమవారం ఆరు గంటలకే గ్రామస్తులు మంటకాగుతున్నారు. సాయంత్రం నుంచి ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన ఎం. ప్రణీత్‌కు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.60 విలువ చెక్కును కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అందజేశారు. సోమవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు, యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, కుర్మే మహేందర్, హీరాసింగ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని దర్బ గ్రామానికి చెందిన జాదవ్ శీలబాయికు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.8,500 చెక్కును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ జాదవ్ గణేష్ అందజేశారు. సోమవారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు జాదవ్ సుజిల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అందజేస్తున్న పోలీసులు

ఇచ్చోడ: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు ఆత్రం శంకర్‌కు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై లక్ష్మినారాయణ చారి అందచేశారు. ఆదివారం రాత్రికి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల వద్ద పెట్రోలింగ్ పార్టీకి సెల్‌ఫోన్ దొరకింది. దీంతో సోమవారం వివరాలు తెలుసుకొని ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌కు చెందిన ఆత్రం శంకర్‌కు అందచేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్, గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామసమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన దుర్వ యశ్వంత్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి గ్రామానికి చెందిన దుర్వ రాజు కుమారుడు దుర్వ యశ్వంత్‌రావు బైక్‌పై వేగంగా వచ్చి బజార్‌హత్నూర్ నుంచి ఇచ్చోడ వైపు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను 108 అంబులెన్సులో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఎస్‌వోఎస్

ఆపత్కాలంలో పనిచేయదు



పరికరాలు లేని ఎస్‌వోఎస్

నేరడిగొండ: జాతీయ రహదారిపై నిత్యం ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఒంటరిగా వెళ్తున్న పలు సందర్భాలో వాహనాలు మొరాయిస్తూ ఉంటాయి. ఆ పరిస్థితిలో ఎవరికీ ఫోన్ చేసి సాయం అడగాలో తెలియని పరిస్థితి. అలాంటి వారి కోసం ఎన్‌హెచ్ఏఐ సంస్థ ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారిపై రెండు కిలో మీటర్లకు ఒకటి చొప్పున ఎస్‌వోఎస్ ఫోన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఎస్‌వోఎస్ పరికరాలు లేకుండానే దర్శనమిస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే సమాచారం అందించలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్‌వోఎస్ యంత్రాలు పనిచేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అయ్యప్పస్వాములకు ముస్లిం యువకుడి భిక్ష



భిక్ష పెడుతున్న నితిన్

తాంసి: అయ్యప్ప మాలధారులకు భిక్ష నిర్వహించి ముస్లిం యువకుడు మత సామరస్యాన్ని చాటాడు. పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన షేక్ నితిన్ గ్రామంలోని అయ్యప్ప స్వాములకు సోమవారం భిక్ష ఏర్పాటు చేశాడు. గ్రామ వేంకటేశ్వర ఆలయంలో అయ్యప్ప మాలాధారులకు స్వయంగా యువకుడు అన్నంను వడ్డించి భిక్షలో పాల్గొన్నారు. మతసామరస్యం చాటిన నితిన్‌ను గ్రామస్తులు అభినందించారు.